నిలిచిన వంతెన నిర్మాణం

- లింగంపల్లికలాన్ శివారులోని పోచారం ప్రధాన కాలువపై వంతెనకు రూ.50.90 లక్షల నిధులు మంజూరు
- గత మేలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన
- పిల్లర్ల దశలోనే నిలిచిన నిర్మాణం


లింగంపల్లికలాన్ శివారులో పోచారం ప్రధాన కాలువపై నిలిచిన వంతెన పనులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లికలాన్ శివారులోని పోచారం ప్రధాన కాలువపై చేపట్టిన వంతెన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులకు మళ్లీ ప్రమాదకర పరిస్థితుల్లో కాలువ దాటక తప్పేలాలేదు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం తొందరగా పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎదురుచూపులు...

లింగంపల్లికలాన్ గ్రామస్తులు వారి పంట పొలాలకు వెళ్లేందుకు గ్రామశివారులోని పోచారం ప్రధాన కాలువ దాటాల్సిందే. లేదంటే చుట్టూ కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఉంది. చుట్టూ తిరిగి వెళ్లలేక ప్రమాదకర పరిస్థితుల్లో నిండుగా ప్రవహిస్తున్న పోచారం ప్రధాన కాలువను దాటే క్రమంలో గతంలో చాలా మంది రైతులు వారి ప్రాణాలను కోల్పోయారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని పోచారం ప్రధానకాలువపై వంతెన నిర్మాణం చేపట్టి తమ సమస్యను పరిష్కరించాలని గతంలో చాలామార్లు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వంతెన నిర్మాణానికి నార్మల్ స్టేట్ ప్లాట్ నిధులలో నుంచి రూ.50.90 లక్షల నిధులను కేటాయించారు. ఈ మేరకు గ్రామశివారులోని పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మాణం కోసం గత మే నెల 28న అప్పటి భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. కాగా వంతెన నిర్మాణం పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ వంతెన నిర్మాణాన్ని పిల్లర్ల దశలో నిలిపివేశారు.

యాసంగిసాగు మొదలైతే కష్టమే..

మండలంలోని పోచారం ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని 'బీ' జోన్‌లో యాసంగి పంటల సాగు నిమిత్తం జనవరి 4న ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చే యనున్నారు. సుమారు 3 నెలల పాటు ప్రాజెక్టు నుంచి విడతల వారీగా నీటి విడుదల కొనసాగనుంది. ఈ క్రమంలో లింగంపల్లి కలాన్ వద్ద పోచారం ప్రధాన కాలువపై వంతెన నిర్మాణం యాసంగి సాగు పూర్తయ్యేవరకు చేపట్టే అవకాశం లేదు. 'యాసంగి' సాగుకు నీటి విడుదల పూర్తయిన తర్వాతే వంతెన నిర్మాణం చేపట్టేందుకు వీలవుతుంది. అధికారులు స్పందించి పనులు వేగవంతమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే కేవీఆర్ జన్మదిన వేడుకలు


లింగాపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పేరిట అర్చన చేయిస్తున్న బీజేపీ నేతలు


భిక్కనూరులో ..

కామారెడ్డి టౌన్/కామారెడ్డిరూరల్/భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకట రమణారెడ్డి(కేవీఆర్) జన్మదిన వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో చేరుకుని వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. పట్టణంలో భారీ ఫ్లెక్సీలతో అభిమానులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గంజ్‌లో పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే పేరిట ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే భిక్కనూరు మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. తన విజయానికి కృషి చేసి, తనపై అభిమానం చాటుతున్న వారి కోసం ఎల్ల కాలం రుణపడి ఉంటానని కేవీఆర్ తెలిపారు.

మల్లన్న జాతరకు రావాలని కేవీఆర్‌కు ఆహ్వానం



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఈ నెల 6 నుంచి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మల్లన్న జాతరకు కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ రావాలని కోరుతూ సోమవారం వీడీసీ ప్రతినిధులు, గ్రామస్తులు ఆహ్వాన పత్రికను అందజేశారు. 9న మంగళవారం సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన, కళబృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఈ జాతరకు తప్పకుండా హాజరుకావాలని వారు కోరారు. వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజు పాటిల్, బీజేపీ నాయకులు చిన్నోళ్ల రజనీకాంత్ ఉన్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అర్ధరాత్రి సమయంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ ఆర్టీఐ యాక్టివిస్ట్‌గా ప్రశంసాపత్రం



లింగంపేట(ఎల్లారెడ్డి): పోతాయిపల్లి గ్రామానికి చెందిన లెగ్గల రాజుకు జిల్లా ఉత్తమ ఆర్టీఐ యాక్టివిస్ట్‌గా ప్రశంసా పత్రం అందుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో సమాచారం హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ద్వారా జిల్లాలో ప్రజలను చైతన్య పర్చడానికి అత్యధికంగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించినందుకు లెగ్గల రాజుకు ఈ ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న అందజేశారు. రాష్ట్ర డైరెక్టర్ సలీమ్, సలహాదారులు మల్లికార్జున్, ప్రదీప్, లింబయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా జగదీశ్వర్

కామారెడ్డి రూరల్: బీసీ జాతీయ సంక్షేమ సంఘం కామారెడ్డి మండల అధ్యక్షుడిగా గర్గుల్‌కు చెందిన కొట్టూరి జగదీశ్వర్‌ను నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియమించినందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాముని సుదర్శన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాముని సుదర్శన్, జిల్లా అధ్యక్షుడు చందర్, మహిళ అధ్యక్షురాలు మంజుల, తదితరులున్నారు.

లింగాపూర్ ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: లింగాపూర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడూరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, కార్యదర్శిగా ఇమ్మడి నవీన్ కుమార్, కోశాధికారిగా శేఖర్, సమావేశ కార్యదర్శిగా శ్రీనివాస్, సలహాదారులుగా ర మేశ్, చిట్టబోయిన ప్రభాకర్, సిద్ధిరాములు, కృష్ణ, రాములు, సభ్యులుగా నర్సింలు, చంద్రం, చిన్న లక్ష్మి, గంగాధర్, కృష్ణమూర్తి, బాలనర్సు, ప్రతాప్, పద్మలను ఎన్నుకున్నారు.

షిర్డీకి భక్తుల పాదయాత్ర



మద్నూర్(జుక్కల్): మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన షిర్డీకి సోమవారం మండల కేంద్రానికి చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. 15 రోజుల పాటు 450 కిలోమీటర్ల పాదయాత్ర చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ నెల 14కు షిర్డీకి చేరుకుంటామని వారు అన్నారు. గంగారం, రామారావ్, గంగాధర్, సురేష్, ప్రకాష్, శ్రీనివాస్, శివ, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు

భిక్కనూరు: మాజీ మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలను భిక్కనూరు మండల కాంగ్రెస్ నేతలు సోమవారం తెలిపారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌లు కలిసి శాలువతో సత్కరించారు. నేతలు సిద్దారెడ్డి, వెంకట్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రాజారెడ్డి, రవీందర్‌రెడ్డిలు ఉన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీ చించివేత.. చర్యలకు డిమాండ్



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జన్మదినం సందర్భంగా 21వ వార్డు బీడీ వర్కర్స్ కాలనీలో కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున చింపివేసారు. ఆందోళన వ్యక్తం చేస్తూ పట్టణ పోలీసులకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. చింపివేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ కూచన మల్లేషం, నవీన్ తదితరులు డిమాండ్ చేశారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై కేసు నమోదు చేయాలి


ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు శశికాంత్ మాట్లాడుతూ.. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుతూ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిల ఫ్లెక్సీలు పెట్టామని, ఇది జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీని చింపివేశారని, వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడుతున్నారని, వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని అన్నారు. ఎంపీటీసీ సందీప్, నాయకులు పోగు నారాయణ, ఆరిఫ్, మన్నన్ తదితరులున్నారు.

ఎదుగుదల చూసి ఓర్వలేకనే ఆరోపణలు

- శివాయిపల్లి సర్పంచ్ విఠల్‌రెడ్డి


పత్రాలను చూపుతున్న సర్పంచ్ విఠల్‌రెడ్డి

రాజంపేట: తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేకనే కొంత మంది వ్యక్తులు తనపై ఆరోపణలకు పాల్పడుతున్నారని శివాయిపల్లి సర్పంచ్ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమకు సర్వే నెంబరు 566/1లో తన భార్య ఏనుగు వనజ పేరు మీద అసైన్డు భూమి పట్టా పొందినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన పాస్‌బుక్ మంజూరు సమయంలో తమకు డిజిటల్ బుక్ సైతం మంజూరైనట్లు పేర్కొన్నారు. గ్రామంలో వీడీసీ పేరుతో కొందరు వ్యక్తులు కావాలనే తనపై అభాండాలు మోపుతున్నారని మండిపడ్డారు. అధికారులకు ఆధారాలతో వివరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తమ భూమిలో కంచె తొలగించిన విషయంపై ఎస్పీ దృష్టికి తీసుకెళతానని ఈ సందర్భంగా హెచ్చరించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి రాజంపేట మండల కేంద్రంలోని సర్వే నెంబరు-576లోని అసైన్డు భూమిలో 4 ఎకరాల భూమి ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

ఇరుకు వంతెనకు మరమ్మతులు ప్రారంభం


ప్రధాన కాలువలో పూడికతీస్తున్న జేసీబీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట శివారులో పోచారం ప్రధాన కాలువపై ఉన్న ఇరుకు వంతెనకు సోమవారం నీటిపారుదల శాఖ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. దీనిలో భాగంగా జేసీబీతో ప్రధానకాలువలో పూడికతీత పనులను చేపట్టారు. శిథిలావస్థకు చేరిన ఇరుకు వంతెనకు మరమ్మతుల కోసం రూ.7.5 లక్షలతో అధికారులు అంచనాలు రూపొందించి ఉన్నతాధికాలకు పంపారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడంతో పనులు ప్రారంభించారు.

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు


నెమ్లి ఆలయంలో భక్తుల సందడి


సలాబత్‌పూర్ ఆలయంలో ..


జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ మైదానంలో..

కొత్త సంవత్సరం వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. వేకువజాము నుంచే మహిళలు తమ ఇళ్ల ముందు కల్లాపి చల్లి, రంగు, రంగుల రంగవల్లులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


అవాజ్‌పల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళ


ఉగ్రవాయి షిరిడీ సాయిమందిరంలో..


తాడ్వాయి: వేంకటేశ్వరాలయంలో..


నీలకంఠేశ్వరాలయంలో ..


పిట్లం సాయిబాబా ఆలయంలో..


ఎల్లారెడ్డి సాయిబాబా ఆలయంలో..


తాండూర్‌లోని త్రిలింగ రామేశ్వరాలయంలో..


మహమ్మద్‌నగర్‌లో ముగ్గు వేస్తున్న యువతి


దోమకొండలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న కుటుంబసభ్యులు


భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో..

రాములోరి అక్షింతల శోభాయాత్ర

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్షింతలతో కూడిన కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. జై శ్రీరామ్, రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్‌కి అంటూ నినాదాలు చేస్తూ ఆలయాల వరకు ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్రలో ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, పలు హిందూసంఘాల సభ్యులు, అయ్యప్పస్వాములు, బీజేపీ నాయకులు, స్థానిక గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


లింగంపల్లిలో అక్షింతల ఊరేగింపు


ఉప్పర్‌పల్లిలో..


సోమార్‌పేట్‌కు చేరిన శ్రీరాముడి అక్షింతలు


భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ రాజు


బరంగేడ్గిలో..


భిక్కనూరులో..

మానవ హక్కులపై చైతన్యపరచాలి


మాట్లాడుతున్న షిబా రాణి

కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి కొత్త సంవత్సరం కేక్ కట్ చేశారు. సమాచార హక్కు చట్టం, మానవ హక్కులపై ఈ సంవత్సరం మరింత ఉత్సాహంగా పని చేసి ప్రజలను చైతన్యం చేయాలని ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధి షిబా రాణి అన్నారు. సమావేశంలో ఆర్టీఐ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజన్న, డైరెక్టర్ ఎంఏ సలీం, పి.మల్లికార్జున్, శివపూజ లింబయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

పలు గ్రామాల్లో ప్రజాపాలన సభలు

మాచారెడ్డి/బాన్సువాడ రూరల్: పాల్వంచ మండలం ఆరేపల్లి, బండరామేశ్వరపల్లి మాచారెడ్డి మండలం అక్కాపూర్, కాకుల గుట్ట తండా గ్రామాల్లో, బాన్సువాడ మండలం కోనాపూర్, కొత్తాబాది, ఇబ్రహీంపేట్ తండాల్లో మంగళవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ, బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 6 గ్యారంటీలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలను డబ్బులు పెట్టి కొనొద్దని, జీపీ కార్యాలయాల్లో ఉచితంగా లభిస్తాయన్నారు.

మహావీర్ అమరవీరులకు నివాళులు


నివాళులర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: మహావీర్ అమరవీరులకు సోమవారం ఘన నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాయం ముందు అమరవీరుల స్థూపానికి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బాగయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 205 ఏళ్ల క్రితం భారతదేశంలో 28 వేల పీశ్వ రాజుల సైన్యాన్ని ఓడించి అమరులైన 500 మంది మహావీరుల త్యాగానికి గుర్తుగా ప్రతి యేటా జనవరి 1న నివాళులర్పిస్తున్నట్లు వారు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉన్నన్ని రోజులు బీమాకోరేగావ్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించేవారని గుర్తు చేశారు. అడ్లూర్ మాజీ సర్పంచ్ రాములు తదితరులున్నారు.

అంబేడ్కర్ భవన్ పనులు ప్రారంభం



బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో సోమవారం అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నియోజకవర్గ ప్రత్యేక నిధుల నుంచి గ్రామంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.10 లక్షలు మంజూరు చేయించారని వారు తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టాలని గ్రామస్తులు కాంట్రాక్టర్‌ను కోరారు. ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ షేక్ అక్బర్, బీఆర్ఎస్ నాయకులు బాల్‌సింగ్, సాయిబాబా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.